క్లుప్తంగా

మునగపాకలో వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ఏఎస్ఐ దొర కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు. వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అరబుపాలెంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు



అరబుపాలెంలో పైప్‌లైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో పాడైన పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకుడు రమణను పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: అరట్లకోట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తూము రమణను ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల కాలికి శస్త్ర చికిత్స జరిగి ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న రమణ ఆరోగ్య పరిస్థితిని చిక్కాల తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలపర్తి సతీష్, తూము రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోతురాజుబాబు పండగ రేపు



పోతురాజు బాబు పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మునగపాక: ఉమ్మలాడలో పోతురాజు బాబు పండగ మంగళవారం జరగనుంది. ఈ మేరకు పోస్టర్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, మొల్లేటి వాసు, నరసింగరావు, సూరిశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న జగన్నాథరావు

మునగపాక: పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో చేపడుతున్న గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మంగళవరపుపేటకు చెందిన ఆడారి జగన్నాథరావు, రామలక్ష్మి దంపతులు రూ.5వేలు, రాపేటి అప్పలనాయుడు, సాయిలా దేవీ దంపతులు రూ.5వేల విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

అక్రమానికి అడ్డేదీ?

- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు
- కొండలు, చెరువులను సైతం తవ్వేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



లోవ చెరువులో అక్రమ తవ్వకాలు



పాయకరాని చెరువులో తవ్విన మట్టి

పాయకరావుపేట: గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. రాత్రీ పగలు తేడాలేకుండా మట్టి మాఫియా దర్జాగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పాయకరావుపేట మండలంలోని పెద్దిరాజుపేట, గోపాలపట్నం, కందిపూడి తదితర గ్రామాల పరిధిలోని కొండల నుంచి గ్రావెల్‌ను పలువురు అక్రమంగా తరలిస్తున్నారు. ఏవిధమైన అధికారులు అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. పోలవరం కాలువ గట్టు గ్రావెల్‌ను కూడా ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. లేఅవుట్‌లు ఎత్తు చేసుకోవడానికి, పునాదులు ఎత్తు చేసుకోవడానికి ఇక్కడి మట్టిని రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. గోపాలపట్నం వద్ద నున్న సీతమ్మ కొండ వెనుక గల లోవచెరువులో గ్రావెల్ రవాణా నిత్యం కొనసాగుతోంది. ఆయా చోట్ల రాత్రి సమయంలో పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేమి, మరికొన్ని చోట్ల అధికారుల ఉదాసీనత కారణంగా గ్రావెల్ దందా రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇలా కొండల్ని పిండి చేయడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్నారు.

అక్రమ తవ్వకాలతో చెరువులకు ముప్పు

మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న సాగునీటి చెరువులను సైతం అక్రమార్కులు వదలడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే చెరువులకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో మట్టిని తవ్వడం వల్ల చెరువు గర్భం లోతు పెరిగి పంట పొలాలకు నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాలపట్నం ఆవ, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కందిపూడి, ఈదటం తదితర గ్రామాల పరిధిలోని పాయకరాని చెరువు, చిన్న చెరువు, పెద్ద చెరువు, వెంకటపతిరాజు చెరువు, తదితర చెరువుల్లో మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక సీఐ జి.అప్పన్నను సంప్రదించగా.. చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన పొక్లెయిన్, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రావెల్ అక్రమ రవాణాపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు.



వెంకటపతిరాజు చెరువులో తవ్వుతున్న పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

తుప్పలతో అవస్థలు



మంగవరం రోడ్డులో పెరిగిన తుప్పలు

పాయకరావుపేట: మండలంలోని మంగవరం గ్రామం వెళ్లే రోడ్డులో తుప్పలు పెరిగిపోయాయి. పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, పెద్దిరాజుపేట, గోపాలపట్నం, పెంటకోట, సత్యవరం మాసాహేబుపేట తదితర గ్రామాలతో పాటు నక్కపల్లి మండలంలో గలగునుపూడి, బంగారమ్మపేట, డీఎల్‌పురం తదితర గ్రామాలకు నిత్యం ప్రజలు వాహనాలు, బైక్‌లు, ట్రాక్టర్లు, ఆటోలు, టిప్పర్లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహన చోదకులకు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా పెరిగిన తుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా శిథిల బ్రిడ్జి



మునగపాకలో ప్రమాదకరంగా బ్రిడ్జి

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో బ్రిడ్జి శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డు నుంచి గ్రామంలోకి వచ్చేందుకు వీలుగా గతంలో సాగునీటి కాలువపై బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ఈ బ్రిడ్జి మీదుగా వందలాదిగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి అడుగుభాగం పెచ్చులూడిపోయింది. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గతుకుల రోడ్డుతో పాట్లు



గుర్రాజుపేట జంక్షన్ వద్ద పాడైన రోడ్డు



ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

ఎస్.రాయవరం: రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో అతి తక్కువ కాలంలో గతుకులమయంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో అడ్డురోడ్డు–రేవుపోలవరం రోడ్డును సుమారు రూ.16 కోట్లు నిధులు కేటాయించి హడావుడిగా నిర్మించారు. 2018 ఏడాదిలో సీఎం చంద్రబాబు గుడివాడ గ్రామ పర్యటన ఉండడంతో హడావుడిగా రోడ్డు నిర్మాణం చేశారు. సుమారు 9 కిలో మీటర్ల మేర నిర్మాణం చేసిన ఈ రోడ్డులో ఎత్తు, పల్లాలు చదును చేయకపోవడం, రోడ్డుకిరువైపులా కాలువ బెర్మలు తవ్వకపోవడంతో వర్షం పడినప్పుడు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఆరేళ్లుగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నా ఆర్ అండ్ బీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పుడు ఏకంగా గుర్రాజుపేట రోడ్డు జంక్షన్ వద్ద, కొరుప్రోలు శివారు జగనన్న కాలనీ రోడ్డు వద్ద, గుడివాడ, కొత్తపోలవరం, రేవుపోలవరం జంక్షన్ల వద్ద రోడ్డు గుంతలు పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కె.జె.పురంలో ఘనంగా ఒడ్డు పండగ



కె.జె.పురంలో ఆటో వర్కర్స్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ అమ్మవారికి ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. మోదమాంబ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, వర్కర్స్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఘటాలు నెత్తిన పెట్టుకుని గ్రామ పుర వీధు ల్లో ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నా రు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వాక మరిడమ్మ పండగ



వాక మరిడమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో ఆదివారం వాక మరిడమ్మ అమ్మవారి పండగను గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులతో పాటు గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ప్రతి ఏడాది ఉపాధి వేతనదారులతో అమ్మవారి పండగను వీఆర్పీ ఆర్.వెంకటలక్ష్మి జరుపుతున్నారు. ఈ పండగను నిర్వహించుకోవడం ద్వారా ప్రజలకు, ఉపాధి వేతనదారులకు మంచి జరుగుతుందనే నమ్మకంతో ప్రతి ఏటా జరుపడాన్ని చేస్తున్నట్టు వీఆర్పీ తెలిపారు. గ్రామంలో గల సతకం పట్టు నుంచి ఊరేగింపుగా ప్రజలు, ఉపాధి వేతనదారులు అడ్డూరి కొండ వాగు సమీపంలో గల వాక మరిడమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఉపాధిహామీ మేట్‌లు పాల్గొన్నారు.

దశావతారాల విగ్రహాల ఏర్పాటుకు విరాళాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలకు పలువురు దాతలు రూ.60 వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి మునగపాక బాబూరావు, మిత్రులు సుకవాసి నారాయణరావు, బొర్ల గౌరీ చంద్రశేఖర్, అడ్డూరి రామప్రసాద్ కలిసి రూ.30,116 అందజేశారు. కొల్లూరు నరసింగరావు, ఆనాల తాతయ్య నాయుడు, మజ్జి వెంకటరమణలు ఒక్కొక్కరూ రూ.10116 చొప్పున అందజేశారని ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జి ఫణీష్ , కోన సురేష్ తెలిపారు.

ప్రజాధనం దుర్వినియోగం

- యోగా డేతో ప్రయోజనం శూన్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ



దేవరాపల్లి : యోగా డే పేరిట కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేయడం అత్యంత దారుణమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్న పాలకులు ఇంత ప్రచార ఆర్భాటంగా యోగా డేను నిర్వహించడం వల్ల ప్రజలకు ఒరిగిందేమిటని ఆయన ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, గిన్నిస్ బుక్ రికార్డుల కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలు వదిలి ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు యోగా డే ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో సుమారు నెల రోజులుగా పాలన స్తంభించిపోయిందన్నారు. బస్సులు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారన్నారు. యోగా పట్ల సానుకూల దృక్పథం ఉంటే ప్రతి స్కూల్‌లో యోగా టీచర్‌ను నియమించి యోగా శిక్షణ ఇప్పించాలని రమణ సూచించారు.

వాకర్స్ అండ్ వాకర్స్ నూతన కార్యవర్గం



వాకర్స్ అండ్ వాకర్స్ కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంవాకర్స్ అండ్ వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా రాజాన అప్పారావు, ఎడ్ల త్రినాథ్, అధ్యక్షునిగా పెతకంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా ఎడ్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బుద్ధ నాయుడు, కోశాధికారిగా పాలమరశెట్టి ఓం నమఃశివాయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నూతన కార్యవర్గం పదవీ కాలం రెండేళ్లపాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ సభ్యులు మునుకూరి రామకృష్ణ, కోలాటి నవీన్‌కుమార్, వేగి రాము, ఎవీ బ్రహ్మానందం, రెడ్డి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర పంటలపై రైతుల ఆసక్తి



రోలుగుంటలో పెసర బొట్లలు సేకరిస్తున్న మహిళా రైతు

రోలుగుంట : మండలంలో పలు గామాల్లో గల రైతులు అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. కోమరవోలు గ్రామంలో జీడి తోటలో సుమారు 20 ఎకరాల మేర విస్తీర్ణంలో రైతులు పెసరపంట సాగు చేశారు. కొండపాలెం, రోలుగుంట, కొవ్వూరు తదితర గ్రామాల్లో జీడితోటలో సుమారు 210 ఎకరాల విస్తీర్ణంలో నువ్వు పంట సాగు చేశారు. అలాగే కె.నాయుడుపాలె, శరభవరం, బుచ్చింపేట, లగుడు కొత్తూరు, జానకీరాంపురం తదితర గ్రామాల్లో మినుములు, బొబ్బర తదితర స్వల్పకాలిక పంటలు సుమారు 180 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేపట్టారు. ఇలా రైతులకు అనుకూలమైన స్వల్పకాలిక పంటలు వేశారు. వీటికి దుక్కు, కలుపు మొక్కల తొలగించేందుకు గొప్పులు పనులు మినహా వర్షాలతో పని లేదు. పెసరలో ఆకు పచ్చపురుగు తెగులు సోకిన పంటల్లో వ్యవసాయాధికారి సూచనలతో పిచికారి చేసి నివారించుకున్నారు. ప్రస్తుతం కాయ దశలో ఉండడంతో రైతులు వీటిని సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇవి ఒక పంట పోయినా మరో పంట కలిసి వస్తుందని, పెట్టుబడులు పోను దిగుబడుల ఆధారంగా ఖర్చులకు బాగానే మిగులుతాయిని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలకు సఖి సేవా సమితి వితరణ



ఆశ్రమ పాఠశాలలో సఖి సేవా సమితి సంస్థ సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలకు విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన శ్రీసఖి సేవా సమితి సభ్యులు నోటు పుస్తకాలు, నిత్యావసర సరకులు ఆదివారం అందజేశారు. సంవత్సరానికి సరిపడా నోటు పుస్తకాలు, బోధన పరికరాలు, చాపలు, 25 రైస్ బ్యాగ్‌లు, ఒక నెలకు సరిపడా నిత్యావసర సరకులు, సుమారు రూ.2 లక్షల విలువ గల స్టేషనరీని ఆశ్రమ పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి.పట్నాయక్‌కు అందించారు. గత 20 సంవత్సరాలుగా పాఠశాలకు తమ సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీసఖి సేవా సమితి సభ్యురాలు బిందు రాణికి పాఠశాల సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలో అతిథులు, కోచ్ వెంకట్‌తో క్రీడాకారులు

అచ్యుతాపురం రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని స్థానిక వైద్యులు జగదీశ్, సుధీర్ అన్నారు. ఆదివారం భోగాపురం క్రీడా ప్రాంగణంలో వీఆర్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సుమారు 80 మంది క్రీడాకారులకు రగ్బీ క్రీడపై నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం కనబరిస్తే విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు పతకాలు, బహుమతులు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

105 మందికి నేత్ర వైద్య పరీక్షలు



గ్రామస్తులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక తులసీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్, యలమంచిలి తులసి ఆప్టికల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 37 మందికి కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు అరుణ, ప్రతినిధులు ఎం.అరుణ్‌కుమార్, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

‘యువత పోరు’ను విజయవంతం చేయండి

అచ్యుతాపురం రూరల్ : కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చకపోవడంపై యువత పోరు పేరుతో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం జరగబోయే ధర్నాను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు విద్యార్థులు, నిరుద్యోగులు, పార్టీ నాయకులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా చేస్తామని పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు కారుకుండి శ్రీను తెలిపారు.

ఆదమరిస్తే అంతే!



జాతీయ రహదారిపై గొడిచర్ల వద్ద రోడ్డు పక్కన కుప్పలుగా వేసిన వేస్ట్ మెటీరియల్



ఒడ్డిమెట్ట సమీపంలో చదును చేయకుండా వదిలేసిన తారుకుప్పలు

- జాతీయ రహదారికి ఇరువైపులా కుప్పలుగా వేస్ట్ మెటీరియల్
- ప్రమాదాలకు ఆస్కారమని వాహనచోదకుల భయాందోళన

నక్కపల్లి: నేషనల్ హైవే అధికారుల నిర్వాకం కారణంగా వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు జాతీయ రహదారిలో మరమ్మతులు చేపడుతున్నారు. తారురోడ్డు ఎక్కడికక్కడ పాడవడంతో నేషనల్ హైవే అధికారులు మరమ్మతులు చేపట్టే క్రమంలో రోడ్డును తవ్వి దాని స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా తవ్వకాలు జరపగా వచ్చిన తారు కలిపిన నల్లపిక్కను తొలగించి రోడ్డు పక్కనే గుట్టలుగా వేస్తున్నారు. ఇలా వేసిన గుట్టలను జాతీయ రహదారికి ఇరువైపులా ఉండే బెర్మ్‌లపై చదును చేసి రోడ్డుకు సమానంగా రోలింగ్ చేయాల్సి ఉంది. అలా చేస్తే రోడ్డుకు సమానంగా బెర్మ్‌లు కూడా ఉండే అవకాశం ఉంటుంది. కానీ ఇటీవల కాలంలో జాతీయ రహదారి మరమ్మతు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నక్కపల్లి దాటిన తర్వాత చినదొడ్డిగల్లు, కాగిత, వెదుళ్లపాలెం, ఉద్దండపురం, గొడిచర్ల, ఒడ్డిమెట్ట తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా కుప్పలుగా వేసిన రద్దు మెటీరియల్‌ను చదును చేయకుండా అలాగే వదిలేశారు. ఇటీవల కాలంలో నక్కపల్లి, పాయకరావుపేట మధ్యలో వారానికొక సారి రోడ్డు ప్రమాదం సంభవించి పలువురు మృత్యువాత పడటం, క్షతగాత్రులవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. కోల్‌కతా, చెన్నై మధ్య ఉన్న ఈ 16వ నెంబరు జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు లైన్లుగా ఉన్న ఈ రహదారిపై పరిమితికి మించి వేగంతో ప్రయాణించే వాహనాలు కూడా ఉన్నాయి. భారీ వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో బైకులు, ఆటోలు బెర్మ్ దిగాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి సందర్భంలో ఆదమరిచినా, ఏమరపాటుగా ఉన్నా బెర్మ్‌లపై కుప్పలుగా పోసిన ఈ వేస్ట్ మెటీరియల్‌ను ఢీకొడితే అంతే సంగతులు. ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడాల్సిందే. అధికారులు స్పందించి రోడ్డుపక్కన వేసిన వేస్ట్ మెటీరియల్‌ను తొలగించడం లేదా చదును చేయించడం చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వేస్ట్ మెటీరియల్‌ను తొలగించాలి..

జాతీయ రహదారి మరమ్మతు పనుల్లో భాగంగా తొలగించిన మెటీరియల్‌ను అక్కడక్కడ రోడ్డుపక్కన కుప్పలుగా పోశారు. వీటిని చదును చేయకపోవడం వల్ల రాకపోకలు సాగించేవారు ప్రమాదాల బారిన పడతామనే భయందోళనలు చెందుతున్నారు. అసలే రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిపూట ఈ కుప్పలను ఢీకొని ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వెంటనే ఈ కుప్పలను తొలగించడం, చదును చేయించడం గానీ చేయాలి.

– దేవవరపు శివ, కాగిత

హైవే అధికారులతో మాట్లాడతా..

నక్కపల్లి నుంచి పాయకరావుపేట మధ్యలో రోడ్డు పక్కన వేస్ట్ మెటీరియల్‌ను కుప్పలుగా వేసిన చదును చేయని విషయం తన దృష్టికి వచ్చింది. హైవే అధికారులతో మాట్లాడి వెంటనే తొలగించడం లేదా చదును చేయించడం చేస్తాం. ఇలా వదిలేస్తే ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది.

– కుమార స్వామి, సీఐ, నక్కపల్లి